ఇంటింటా సంక్షేమమే జగనన్న ధ్యేయం

- పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

బంగారుపాళెం: నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించడమే జగనన్న లక్ష్యమని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని చీకూరుపల్లె, కేజీ సత్రం, సీఆర్ కాలనీలో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం ద్వారా కుటుంబానికి ఏఏ పథకం కింద ఎంత లబ్ధిచేకూరుతోందో తెలియజేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్లు, మురుగు నీటి కాలువలు ఏర్పాటు చేయాలని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి పథంలో నడిపించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. అనంతరం అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ప్రతి ఇంటికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశమన్నారు.

జగనన్నే మా భవిష్యత్‌పై విశేష స్పందన

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని ఎమ్మెల్యే బాబు అన్నారు. చీకూరుపల్లెలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరించారు. ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభమైన జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం పట్ల ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీలు శిరీష్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ నారే సోమశేఖర్, ఉపాధ్యక్షుడు సర్దార్, జిల్లా యూత్ ఉపాధ్యక్షుడు మహేంద్ర, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు సాయిరెడ్డి, సర్పంచులు భారతి బాలాజీ, ఎంపీటీసీలు స్వాతికమలనాథ్‌రెడ్డి, ఇందుశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చీకూరి శ్రీనివాసులు, ఎస్‌బీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీప్రసన్నకుమార్, బీసీ నాయకుడు దొరస్వామి, తహసీల్దార్ బెన్నురాజ్, ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


బంగారుపాళెం: ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు


కుప్పిగానిపల్లె : జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో నాయకులు

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే బాబు

మండల కేంద్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పాల్గొన్నారు. స్థానిక జామియా మసీదులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు నెల రోజుల పాటు ఉపవాస దీక్ష చేపట్టడం సంతోషకరమన్నారు. అల్లా ఆశీసులతో ఉపవాస దీక్షలో ఉన్న ముస్లింలందరూ ఆరోగ్యంగా ఉండాలని ప్రార్థించారు.

జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు

గుడిపాల: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. గురువారం మండలంలోని కుప్పిగానిపల్లె, 197రామాపురం, నంగమంగళం పంచాయతీలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. వారు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జనార్దన్, శేఖర్, రాకేష్, జయకోడి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి గెలిపించుకుందాం

పూతలపట్టు: మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంగా గెలిపించుకుందామని మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని యం.బండపల్లి పంచాయతీలో గురువారం జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ పద్మావతి త్యాగరాజు, ఎంపీటీసీ యతీష్, వైస్ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, నిరంజన్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, నాయకులు జ్యోతీశ్వర్, మునిరత్నం, రోజమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించుకుందాం


మోహన్, యూటీఎఫ్ మండలాధ్యక్షుడు

ఐరాల: ప్రభుత్వ విద్యారంగాన్ని ప్రతి ఉపాధ్యాయుడు పరిరక్షించుకోవాలని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్‌నాయుడు పిలుపునిచ్చారు. స్థానిక ప్రాథమిక పాఠశాలలో గురువారం మండల యూటీఎఫ్ శాఖ అత్యవసర సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం నుంచి ఉన్నత విద్యారంగం వరకు ప్రభుత్వ విద్యారంగాన్ని విస్తరింపచేసి బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఫలాలు అందేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేటి విద్యార్థులే భావి భారత పౌరులని, వారిని సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని చెప్పారు. నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యదర్శి ఏకాంబరం మాట్లాడుతూ యూటీఎఫ్ సంఘాన్ని మరింత బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. సంఘంలోని ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడుతామన్నారు. అనంతరం మండల నూతన యూటీఎఫ్ అధ్యక్షుడుగా ఎం.మోహన్‌ను ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతో ఉపాధ్యాయుల సంక్షేమానికి నిర్విరామంగా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల ప్రధానకార్యదర్శి అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతగా పని చేయండి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గౌరి

పూతలపట్టు: సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ గౌరి ఆదేశించారు. మండలంలోని గాండ్లపల్లి సచివాలయాన్ని గురువారం తనిఖీ చేసిన ఆమె సచివాలయ సిబ్బందికి, వలంటీర్లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందే ప్రతి పథకం అర్హులందరికీ అందేలా చూడాలని తెలియజేశారు. అర్హుల జాబితాలో ఉండి లబ్ధి పొందని వారి వివరాలు సేకరించాలని వలంటీర్లకు తెలిపారు. సచివాలయ సిబ్బందిలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హుండీ చోరీకి యత్నం

యాదమరి: మండలంలోని పెరుమాళ్ల పల్లెలో వెలసిన శ్రీ కరిమారియమ్మన్ ఆలయంలో హుండీ చోరీకి దొంగలు యత్నించారు. చిత్తూరు-గుడియాత్తం జాతీయ రహదారిపై పెరుమాళ్ల పల్లెలో వెలసిన కరిమారియమ్మ ఆలయంలోని హుండీని బుధవారం రాత్రి దుండగులు పగలగొట్టారు. కానీ ఆలయ గేటుకు బలమైన తాళాలు వేసి ఉండడంతో చోరీ చేయడానికి అవకాశం లేకుండాపోయింది. దీనిపై ఎస్ఐ సుమన్ పరిశీలించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ అబ్బాస్

తవణంపల్లె: మండల కేంద్రంలోని జీసస్ లాస్పెల్ చర్చిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. జీసస్ లాస్పెల్ ప్రెయర్ మినిస్ట్రీ ట్రస్ట్ ప్రెసిడెంట్, పాస్టర్ యేసు ఆధ్వర్యంలో గురువారం చెన్నైకి చెందిన ఎంఎన్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో కంటి వైద్య నిపుణులు అబ్బాస్ 80 మంది కంటి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచిత కంటి ఆపరేషన్ కోసం 25 మందిని ఎంపిక చేసి చెన్నైకి తరలించారు.

ఉద్యోగోన్నతి ఇవ్వాలి

చిత్తూరు కలెక్టరేట్ : శాశ్వత ప్రాతిపదికన టీచర్లకు ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ఎస్సీ,ఎస్టీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మూల్యాంకన పరిశీలనకు విచ్చేసిన జేడీ సర్వీసెస్ మువ్వారామలింగం ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఉపాధ్యాయుల పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు వెల్లడించారు.

ఎండలో పనులకు వెళ్లరాదు


కూలీలతో మాట్లాడుతున్న ఆస్పత్రి వైద్యులు

యాదమరి: కూలీలు ఎండలో కూలీ పనులకు వెళ్లరాదని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ సూచించారు. మండలంలోని దాసరాపల్లె ఆదిఆంధ్రవాడ గ్రామంలో గురువారం కూలీలకు వడదెబ్బపై అవగాహన కల్పించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 10 గంటల వరకు సాయంత్రం 4 గంటల తరువాత కూలీ పనులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీనారాయణ, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు

యాదమరి: పార్టీలకు అతీతంగా లబ్ధిదారులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి తెలిపారు. మండలంలోని పలు గ్రామాలలో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు చిల్లగుండ్లపల్లెలో..

బంగారుపాళెం: గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం మండలంలోని చిల్లగుండ్లపల్లె పంచాయతీలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6.30 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

పూతలపట్టు: మండల పరిధిలో కారు-బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన గురువారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు వావిల్‌తోట పంచాయతీ నొచ్చుపల్లెకు చెందిన అరుణ్‌కుమార్(37) తన మోటారు బైక్‌పై సొంత పనుల నిమిత్తం బండపల్లిలో పని పూర్తిచేసుకుని తిరిగి ఇంటికి వెళ్తుండగా వావిల్‌తోట క్రాస్ వద్ద చిత్తూరు నుంచి తిరుపతికి వెళ్తున్న కారు అదుపు తప్పి ఢీకొట్టింది. దీంతో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అందరి సమస్యలు పరిష్కరిస్తాం


మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: అందరి సమస్యలను పరిష్కారిస్తామని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. స్థానిక బ్రాహ్మణ వీధిలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, అందరికీ సంక్షేమ పాలన అందించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇంటింటికీ వెళ్లి నాలుగు సంవత్సరాల్లో అందజేసిన సంక్షేమ పథకాలను బుక్‌లెట్ ద్వారా తెలియజేశారు. పిళ్లారిగుడివీధిలో రోడ్డు వేయాలని స్థానికులు కోరారు. ఏటివార రోడ్డుపై అడ్డంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభాన్ని తొలగించి మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ఆ ప్రాంతవాసులు విన్నవించారు. ఇంటి స్థలం, పింఛన్ మంజూరు చేయాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జి సీతాపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రెడ్డితోపాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం

స్థానిక కన్యకపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. అనంతరం ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వైశ్యులు చూపుతున్న ఆదరణ మరువలేనిదని చెప్పారు. నియోజకవర్గంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తనను సంప్రదించాలని కోరారు. సంక్షేమ పథకాలు అందకపోతే సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు ద్వారక, రామ్మూర్తి, వెంకటేష్, మురళీ, బాబు రావు, నాగేంద్ర, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

నగరంలోని గంగనపల్లెలో గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి 11 వరకు ఎమ్మెల్యే శ్రీనివాసులు ప్రజాసమస్యలు తెలుసుకుంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

గ్రామాల్లో 'ఫ్యామిలీ ఫిజీషియన్' సేవలు

పూతలపట్టు: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలోని ఉచిత వైద్య సేవలను గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ప్రియాంక అన్నారు. మండలంలోని కమ్మగుట్టపల్లిలో బుధవారం 108 సేవల ద్వారా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో 76 మందికి చికిత్స చేసి ఉచిత మందులను అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసమూర్తి, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మిత, ఏఎన్‌ఎం ప్రభావతి పాల్గొన్నారు.

45 కొత్తపల్లెలో..

ఐరాల: మండలంలోని 45 కొత్తపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ నిర్వహించారు. కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని 45 కొత్తపల్లె సచివాలయంలో గురువారం వైద్యాధికారి శ్రీనివాస్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓలు శివయ్య, సిరాజుద్దీన్, ఎంపీహెచ్ఎస్ నాగరత్నమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, ఏఎన్‌ఎం నాగమణి, ఆశావర్కర్లు పాల్గొన్నారు

వెంగంపల్లెలో..

తవణంపల్లె: మండలంలోని వెంగంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి వినయ్‌కుమార్ 85 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. వెంగంపల్లెలో మంచానికే పరిమితమైన చెన్నకేశవులు ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈఓ విజయలక్ష్మి, ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యంరెడ్డి, రాజేశ్వరి, శ్యామల, ఎంఎల్‌హెచ్‌పీ లావణ్య, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


గుడిపాల: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో డాక్టర్ సుకన్య

రామభద్రాపురంలో..

గుడిపాల: గ్రామాల్లోనే అందుతున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సుకన్య అన్నారు. రామభద్రాపురంలో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. తరలి వచ్చిన షుగర్, బీపీ బాధితులకు రక్త పరీక్షలు నిర్వహించి నెలకు సరిపడే మాత్రలను వారికి ఉచితంగా అందజేశారు. మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్దే వెళ్లి వైద్యం అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం అనురాధ, ఎంఎల్‌హెచ్‌పీ అనిత, హెల్త్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సూపర్‌వైజర్ విజయ, ఆశా వర్కర్ శివగామి పాల్గొన్నారు.




ఐరాల: వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనివాస్, తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, పూతలపట్టు: వైద్య సేవల్లో డాక్టర్ ప్రియాంక

తృణ ధాన్యాల ఆహారమే ఉత్తమం

కార్వేటినగరం: తృణధాన్యాల ఆహారం ఉత్తమమని విశ్రాంత వెల్ఫేర్ అధికారి అరుణాచలం రెడ్డి అన్నారు. గురువారం రాస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సజ్జ, రాగి, జొన్నలను వితరణ చేశారు. ఆయన మాట్లాడుతూ, బియ్యం ఉత్పత్తులకు ముందు తృణధాన్యాలను ఆహారంగా తీసుకోవడం వల్లే నాటి ప్రజలు ఇప్పటికీ ఆరోగ్యంగా ఉంటున్నారని, ప్రస్తుత వ్యవసాయ ఉత్పత్తులన్నీ రసాయనాలతో కూడినవి కావడంతో పలు వ్యాధుల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఆహారమే ఔషధంగా మారే విధానం తృణధాన్యాలతో సాధ్యమన్నారు. కార్యక్రమంలో రాస్ కో-ఆర్డినేటర్ ప్రకాష్ తోపాటు విజయకుమారి, ఘటికాచలంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


తృణధాన్యాలు పంపిణీ చేస్తున్న అరుణాచలం రెడ్డి

బోదకాలు వ్యాధి నిర్మూలనకు కృషి

శ్రీరంగరాజపురం: బోదకాలు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు కోరారు. గురువారం మండలంలోని ఆరిమాకులపల్లె ప్రాథమిక వైద్యశాలను ఆయన సందర్శించారు. మండల వైద్యాధికారి బాలసుబ్రమణ్యం రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోదకాలు వ్యాధి క్యూలెక్స్ దోమకాటు వల్ల వస్తుందని చెప్పారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్తులు వ్యక్తిగ్రత పరిశుభ్రత పాటించి, వ్యాధి సోకిన భాగాలను నిత్యం తడి లేకుండా ఉంచుకోవాలన్నారు. అనంతరం బోదకాలు బాధితులకు సోపులు, టవళ్లు, మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గౌరి, మోహన్‌బాబు, పర్యవేక్షకులు నారాయణ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మహా భారత ఉత్సవాలు ప్రారంభం

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో శ్రీద్రౌపది, ధర్మరాజులస్వామి ఆలయ మహాభారత మహోత్సవాలు బుధవారం ఉదయం అంకురార్పణ, రాత్రి ధ్వజారోహణంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. కుప్పం నియోజకవర్గంలోని 86 గ్రామాలకు చెందిన వన్నెకుల క్షత్రియ కులస్తుల ఆధ్వర్యంలో 18 రోజులు మహోత్సవాలను నిర్వహించనున్నారు. రోజూ పగలు హరికథ, రాత్రి పౌరాణిక నాటక ప్రదర్శన ఉంటుంది. గురువారం ఉదంతుని చరిత్ర, భూతరాజు కథ హరికథా గానం అలరించింది. ఉత్సవాల్లో ప్రధానంగా మే 2న అర్జున తపస్సు, రాత్రి పుష్ప పల్లక్కిసేవ, 3న కీచకవధ ఘట్టం, 4న రథోత్సవం, ఆవుల మళ్లింపు, 5న ఇలావంతుని బలి, 6న ధుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండం పచ్చిగెరిగె, 7న పట్టాభిషేకం కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కాగా అంకురార్పణ పూజల అనంతరం శ్రీధర్మరాజుల విగ్రహం వద్ద కడవపై కత్తిని నిలబెట్టారు. ఉత్సవాలు పూర్తయిన తర్వాత కత్తిని తొలగిస్తారు.

పల్లె ముంగిట్లో సేవలు


వరదరాజుల పల్లె సచివాలయం

ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి పరుగులు తీసే రోజులు పోయాయి. పల్లె ముంగిట్లోనే అన్ని రకాల సేవలు అందుబాటులోకి వచ్చాయి. పాలన ప్రజల చెంతకు వచ్చేసింది. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సచివాలయ వ్యవస్థ దీనికి మూల కారణమైంది. పల్లె ప్రజలు ఊరు దాటకుండా అవసరమైన అన్ని ప్రభుత్వ సేవలు పొందుతున్నారు. తద్వారా అన్ని పంచాయతీల్లో సచివాలయాలే సేవాలయాలుగా ఖ్యాతి పొందుతున్నాయి.

- దూరాభారానికి చెల్లుచీటీ
- గ్రామ స్థాయిలోనే సమస్యల పరిష్కారం

యాదమరి: సచివాలయ వ్యవస్థ పాలనను పల్లె చెంతకు తీసుకొచ్చింది. దీంతో ప్రతి చిన్న పనికీ మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా పోయింది. మండల కార్యాలయం చుట్టూ చెప్పులరిగేలా తిరిగే బాధలు తప్పిపోయాయి. ఎలాంటి సేవ అయినా, సమస్య అయినా సచివాలయాలే పరిష్కారం చూపుతున్నాయి. మరిన్ని సేవలందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నాయి. ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ సులభంగా చేరాలనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయాలు అన్ని వర్గాల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి. పూతలపట్టు నియోజకవర్గంలో 98 సచివాలయాలు ఉన్నాయి. ప్రతి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించి వారి ద్వారా పాలనను ప్రజల ముంగిటకే చేర్చుతున్నారు. ప్రతి సచివాలయంలో రైతులకు విద్యార్థులకు 540 సేవలను అందిస్తున్నారు. అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకం ఇంటి వద్దకే తీసుకువస్తున్న సచివాలయాలపై ప్రజలకు నమ్మకం పెరిగింది. దళారీ వ్యవస్థ లేకుండా సమస్యలను సులభంగా పరిష్కారాలు లభిస్తుండడంతో అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయంలోనే అన్నీ



పింఛన్ మంజూరు చేశారు. గతంలో మాదిరిగా పింఛన్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగలేదు. వలంటీర్‌కు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ ఇచ్చాను. వలంటీర్ సచివాలయంలో దరఖాస్తు చేయించారు. కొన్ని రోజులకు నాకు వృద్ధాప్య పింఛన్ మంజూరైంది. ఈ రోజు రూ.2,750 సొమ్ము అందుకుంటున్నాను. సీఎం వైఎస్ జగన్‌కు ఎంతో రుణపడి ఉంటాము.

–గురుస్వామి, మజరా కొత్తపల్లె గ్రామం

నిమిషంలోనే అడంగల్



గతంలో 1బీ, అడంగల్ కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అంతేకాకుండా ఖర్చుకూడా ఎక్కువ అయ్యేది. సచివాలయాలు వచ్చిన తరువాత మండల రెవెన్యూ కార్యాలయానికి పోవాల్సిన అవసరమే రాలేదు. నేరుగా సచివాలయంలోకి వెళ్లి ఖాతా నెంబరు కానీ, తమ ఆధార్ కార్డు నెంబర్ చెప్పిన నిమిషంలో అడంగల్ కాపీ ఇస్తున్నారు. దీంతో పాటు అవినీతి రహితంగా పనులు జరుగుతున్నాయి.

– మునిరాజులు, రైతు, పెరుమాళ్లపల్లె

ఎంతో సంతృప్తినిస్తోంది



గ్రామాల్లోనే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చాలనే ఉద్దేశంతో సచివాలయాలను తీసుకొచ్చారు. పేదలకు సేవచేయడంతో ఎంతో ఆనందాన్ని కలిగించింది. వలంటీర్ వ్యవస్థతో ఇంటి ముందుకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుంది. లబ్ధిదారుడు కార్యాలయాలకు రాకుండానే పనులు పూర్తి చేస్తున్నాం. పేదలకు సేవ చేయడం ఎంతో సంతోషాన్ని ఇస్తుంది.

–అంజూమ్, కార్యదర్శి, యాదమరి

మెరుగ్గా పారిశుద్ధ్య పనులు

చిత్తూరు అర్బన్ : నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టాలని, ప్రధాన రహదారుల శుభ్రత పనులు ఉదయం 6.30 గంటల కల్లా పూర్తి చేయించాలని నగర కమిషనర్ అరుణ ప్రజారోగ్య విభాగం అధికారులను ఆదేశించారు. కమిషనర్ గురువారం ఉదయం నగరపాలక సంస్థ వాహనాల షెడ్డు, పారిశుద్ధ్య కార్మికుల మస్టర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. వాహనాల షెడ్డులో చెత్త తరలించే వాహనాల డ్రైవర్లతో మాట్లాడారు. నిర్దేశించిన రూట్ మ్యాప్ ప్రకారం వాహనాలను నడపాలని, చెత్తను పూర్తిస్థాయిలో సేకరించాలని సూచించారు. కమిషనర్ క్లాప్ వాహనాన్ని సరదాగా కొంత దూరం నడిపారు. ఉదయం హాజరు నమోదు తర్వాత ప్రధాన రోడ్ల స్వీపింగ్ ప్రక్రియ చేపట్టాలని, 6.30–7గంటల కల్లా పూర్తి చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ విషయంలో ఎక్కడ నిర్లక్ష్యం వద్దని హెచ్చరించారు. ప్రతిరోజు గ్యాంగ్ వర్క్ నిర్వహించడం ద్వారా పారిశుద్ధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని చెప్పారు. అనంతరం కమిషనర్ ఎన్టీఆర్ బస్టాండ్‌లోని మార్కెట్ ప్రాంతాన్ని పరిశీలించారు.

మెరుగ్గా డంపింగ్ యార్డ్ నిర్వహణ

నగరపాలక సంస్థ డంపింగ్ యార్డ్‌ను మెరుగ్గా నిర్వహించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. గురువారం డంపింగ్ యార్డులో కమిషనర్ పరిశీలించారు. ముందుకు వచ్చిన వ్యర్థాల కుప్పలను తొలగించాలన్నారు. బయో మైనింగ్ ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.లోకేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు చిన్నయ్య, నరసింహ, పర్యావరణ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఆటో నడుపుతున్న కమిషనర్ అరుణ